క్లుప్తంగా

ఉద్యోగాలకు ఎంపిక



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, హెచ్ఓడీలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక సాయిరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు మంగళవారం బెంగళూరుకు చెందిన కీలింక్ బిజినెస్ కన్సల్టెంట్ ప్రైవేటు లిమిటెడ్ వారు నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలు సాధించారు. బీటెక్ ఫైనలియర్ సివిల్, మెకానికల్ విద్యార్థులకు డిజైన్ ఇంజినీర్ ఉద్యోగాలకు నిర్వహించిన జాబ్ మేళాలో సతీష్, నర్మద, సుమంత్‌రెడ్డి, చంద్రిక, శివాంజనేయులు, సుచిత్ర, లహరి, శ్రావణ్ కుమార్‌రెడ్డి ఎంపికయ్యారు. వీరికి ఏడాదికి రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వేతనం ఉంటుందని ప్రిన్సిపాల్ పాండురంగన్ రవి, టీపీఓ సునీల్ తెలిపారు. ఉద్యోగాలు సాధించిన వారిని ప్రిన్సిపాల్‌తోపాటు కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీర కళ్యాణ్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, హెచ్ఓడీలు అభినందించారు.

పేద విద్యార్థికి సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న చౌడేశ్వరి తొగట వీర క్షత్రియ సేవా సంఘం నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక తొగటవీర క్షత్రియ కల్యాణ మండపంలో మంగళవారం ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న కుండా హర్షకు రూ.20 వేలను చౌడేశ్వరి తొగటవీర క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో అందించారు. ఈ సందర్భంగా శ్రీ చౌడేశ్వరి తొగటవీర క్షత్రియ సేవా సంఘం అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో ప్రతిభ గల పేద విద్యార్థిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కళాశాల ఫీజుకు అవసరమైన మొత్తాన్ని ఆర్థిక సాయం అందించామన్నారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి చౌడం వెంకటరమణ, కోశాధికారి గంజికుంట ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు ఉమ్మడిశెట్టి చౌడయ్య, సభ్యులు బొలిశెట్టి రామయ్య, సానా మునయ్య పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో ప్రతిభ



ట్రోఫీలు సాధించిన విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైఎంఆర్ కాలనీ సరస్వతీ విద్యామందిరంలోని అబాకస్ సెంటర్ విద్యార్థులు ఇటీవల గుంటూరులో నిర్వహించిన 8వ రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీల్లో ప్రతిభ కనపరచారు. సూర్య చక్రధర్, హేతుశ్రీ, దినేష్‌రెడ్డి, జెనీల్‌రెడ్డి, అక్షర, ప్రత్యూష, మునిఅభినవ్, సాయిచరిత్‌లు ఫౌండేషన్ లెవల్, అడ్వాన్స్ లెవల్ విభాగాల్లో ప్రతిభ కనపరచి 15 ట్రోఫీలు సాధించారు. వీరిని పాఠశాల కరస్పాండెంట్ రామచంద్రయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న నారాయణరెడ్డి

కాశినాయన : మండలంలోని మిద్దెల గ్రామానికి చెందిన సంఘ సేవకుడు, ఆర్ట్ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి.ఎస్.నారాయణరెడ్డికి అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకులు డాక్టర్ సరోజ చేతుల మీదుగా మంగళవారం మహబూబ్‌నగర్‌లో అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 30 సంవత్సరాల నుంచి స్వచ్ఛందంగా సామాజిక సేవ చేస్తున్న నారాయణరెడ్డిని అభినందించారు. అనాథలకు, నిరుపేదలకు అవసరమైన పుస్తకాలను అందించడంతోపాటు పలు సంఘ సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమని కొనియాడారు.

కాలువ ఏర్పాటు



కాలువ తీయిస్తున్న సర్పంచ్ సుధాకర్

పోరుమామిళ్ల : పట్టణంలోని శీనప్పబావి వీధిలో డ్రైనేజీ పూడిపోయి మురుగునీరు వీధిలో నిలువ వుండి ప్రజలకు ఇబ్బందికరంగా తయారవడంతో సర్పంచ్ సుధాకర్ మంగళవారం స్పందించారు. మురుగునీరు వెళ్లేందుకు కాలువ తవ్వించడంతో సమస్యకు పరిష్కారం లభించింది. తాగునీటి పైపులు కూడా మురుగునీటిలో ఉండి పోవడంతో కుళాయిల ద్వారా నీరు తెచ్చుకోవడానికి కూడా ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఈ నేపథ్యంలో సర్పంచ్ సుధాకర్ కాలువ తీయించి, నీరు నిలువ లేకుండా చేయించారు. వీధిలో పెరిగిపోయిన కంపచెట్లను కూడా కొట్టించారు.

బస్‌షెల్టర్ నిర్మాణం ఎప్పుడో..!

- ప్రయాణికులు, భక్తులకు ఇక్కట్లు
- త్వరితగతిన ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి



బి.మఠంలోని మల్లేపల్లె రోడ్డులో నిలిచిపోయిన బస్‌షెల్టర్ నిర్మాణ పనులు

బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రం, మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠంలో బస్ షెల్టర్ లేక ప్రయాణికులు, భక్తులు ఇబ్బంది పడుతున్నారు. గత ప్రభుత్వం బస్‌షెల్టర్ కోసం రూ.12 లక్షల నిధులు మంజూరు చేసింది. పంచాయతీరాజ్ అధికారులు టెండర్లు పిలవగా బి.మఠం ఎంపీపీ పనులు దక్కించుకున్నాడు. పనులు ప్రారంభించారు. ఇంతలో ఎన్నికల కోడ్ రావడం, సమీపంలో నివాసం ఉన్న దూదేకుల సిద్దయ్య కుటుంబ సభ్యులు కోర్టును ఆశ్రయించడంతో పనులు నిలిచిపోయాయి. బద్వేల్ కోర్టులో రెవెన్యూ అధికారులు మాత్రం వంక పొరంబోకు స్థలంగా గుర్తించి, వివరణ ఇచ్చారు. ప్రజల అవసర నిమిత్తం నిర్మాణం చేపట్టాలని రెవెన్యూ అధికారులు తెలిపారు. ఇంతలో ప్రభుత్వం మారింది, పనులు తిరిగి చేయాలని స్థానిక తెలుగుదేశం నాయకులు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ దృష్టికి తీసుకువెళ్లారు. ప్రస్తుతం ఫిల్లర్ల స్థాయిలో ఉన్న బస్‌షెల్టర్ నిర్మాణం కాదని, గతంలో ఉన్న చోట ఏర్పాటు చేయాలని తెలుగుదేశంలో ఉన్న ఒక వర్గం ప్రయత్నిస్తోంది. కానీ అక్కడ వద్దు అనే కదా మరొక చోటికి మార్చిందని మరొక వర్గం అంటోంది. కొంత వరకు పనులు కూడా జరిగాయి కదా అంటున్నారు. ఎంపీపీ మాత్రం తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, టెండర్ల ద్వారా వచ్చిన పనులను ఎందుకు నిలుపుదల చేస్తారని అంటున్నాడు. రాజకీయాలు పక్కన పెట్టి భక్తులు, స్థానికుల అవసరాల కోసం తక్షణం బస్‌షెల్టర్ నిర్మాణం జరగాలని ప్రతిపక్షాలు కోరుతున్నాయి. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ త్వరగా చొరవ చూపి బస్‌షెల్టర్ నిర్మాణం కోసం సహకరించాలని భక్తులు కోరుతున్నారు.

విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేఎన్‌టీయూఏ వైస్ చాన్సలర్ సుదర్శనరావు

చాపాడు : విద్యార్థులు మొబైల్ వాడకాన్ని నిషేధించి స్కిల్ డెవలప్‌మెంట్‌పై దృష్టి పెట్టాలని జేఎన్‌టీయూఏ వైస్ చాన్సలర్ సుదర్శనరావు అన్నారు. స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ)కాలేజీలో మంగళవారం ఇంజినీరింగ్, డిప్లమో, ఎంబీఏ ఫస్టియర్ విద్యార్థులకు 'పరిచయ్–2కె24' పేరుతో ఫ్రెషర్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జేఎన్‌టీయూఏ వైస్ చాన్సలర్ మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడకుండా ఇష్టపడి చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. సాఫ్ట్‌స్కిల్స్, కోడింగ్ స్కిల్స్‌ను డెవలప్ చేసుకోవాలన్నారు. వాల్యూ ఆఫ్‌డేట్ కోరెస్ట్ ద్వారా అవకాశాలు ఉంటాయన్నారు. హైయ్యర్ ఎడ్యుకేషన్ కోర్సు ద్వారా భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు పొందవచ్చన్నారు. సీబీఐటీ కరస్పాండెంటు డా.వి.జయచంద్రారెడ్డి మాట్లాడుతూ సీబీఐటీలో అడుగు పెట్టిన విద్యార్థులు అధ్యాపకులు సూచించిన విధంగా చదువుకుంటే అనుకున్న లక్ష్యం సాధిస్తారన్నారు. తల్లిదండ్రుల ఆశయాలు, తమ ఇష్టాలను క్రోడీకరించి చదువులో విజయం సాధించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జేఎన్‌టీయూఏ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ప్రొఫెసర్ జి.వైశాలి, సీబీఐటీ అకడమిక్ డీన్ డాక్టర్ జి.శ్రీనివాసులరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శ్రుతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భస్మహారతి



అగస్త్యేశ్వరస్వామికి భస్మ హారతి ఇస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం అమావాస్య సందర్భంగా స్వామి వారికి ఘనంగా భస్మహారతి ఇచ్చారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవికి కుంకుమార్చన చేసి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం అగస్త్యేశ్వరస్వామి మూల విరాట్‌కు భస్మంతో అభిషేకించి హారతి ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రతి నెలా జాబ్ మేళాలు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉపాధి కల్పన అధికారి సురేష్ కుమార్

మైదుకూరు : ప్రతి నెలా జాబ్ మేళాలను నిర్వహిస్తామని జిల్లా ఉపాధి కల్పన అధికారి సురేష్ కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో జాబ్ మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏదో ఒక నియోజకవర్గంలో ప్రతి నెల జాబ్ మేళాను నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.రాధారామ్ మాట్లాడుతూ యువత తమ వృత్తి నైపుణ్యాలను కోర్సులో ఉండగానే బాగా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. తమ కళాశాలలో స్కిల్ హబ్ ద్వారా అందిస్తున్న వివిధ రకాల కోర్సుల పట్ల అవగాహన కల్పించారు. భాషా నైపుణ్యాలు, మెంటల్ ఎబిలిటి, అర్థమెటిక్, రీజనింగ్, జనరల్ నాలెడ్జ్ వంటి అనేక అంశాల పట్ల పట్టు సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. జాబ్ మేళాకు జిల్లా వ్యాప్తంగా 232 మంది నిరుద్యోగులు హాజరు కాగా, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వచ్చిన ఐదు కంపెనీల వారు 129 మందిని ఉద్యోగాల్లోకి తీసుకున్నారు. జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ డి.నాగార్జున, జేడీఎం వేణు మాధవ్ పాల్గొన్నారు.

భూ సమస్య పరిష్కారం



పొలం పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

చాపాడు : మండలంలోని చిన్నగురవలూరు గ్రామంలో గత ఐదేళ్లుగా నెలకొన్న భూ సరిహద్దు దీర్ఘకాలిక సమస్యకు మంగళవారం రెవెన్యూ అధికారులు పరిష్కారం చూపారు. గ్రామానికి చెందిన పాలగిరి శివారెడ్డికి చెందిన సర్వే నంబర్ 233–2లో 3.50 ఎకరాల పొలం ఉంది. దీని సమీపాన పొలం ఉన్న జె.ఏసోబు ఆక్రమించినట్లు జిల్లా కలెక్టర్‌కు శివారెడ్డి పలు మార్లు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మండల సర్వేయర్ సాయిలత, జిల్లా సర్వే అధికారి మురళీకృష్ణ సమక్షంలో సమస్య పరిష్కారం చూపారు. భూమి కొలతలు వేసి ఇరువురు రైతులకు ఆమోదయోగ్యంగా సమస్యకు పరిష్కారం చూపారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డీటీ ప్రవీణ్, వీఆర్ఓ, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటరమణ

రాజుపాళెం : వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తీసుకోవాలని రాజుపాళెం ఎస్ఐ కత్తి వెంకటరమణ పేర్కొన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో గ్రామాల్లో విగ్రహాలు ఏర్పాటు చేయబోయే కమిటీ సభ్యులతో మంగళవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విగ్రహాలు నిలపడానికి కమిటీ సభ్యులు పోలీసుల అనుమతి తీసుకోవాలని చెప్పారు. నిమజ్జనం రోజున ఎలాంటి డీజేల ఏర్పాటు, టపాసులు కాల్చడం చేయరాదన్నారు. మైక్ పెట్టే వారు అనుమతి తీసుకోవాలని, నిమజ్జన కార్యక్రమాన్ని చీకటి పడేలోపే వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

నేత్రదానంపై అవగాహన



మాట్లాడుతున్న జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు

ప్రొద్దుటూరు క్రైం : నేత్రదానానికి మించిన దానం మరొకటి లేదని జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు తెలిపారు. నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం నేత్రదానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నేత్రదానం చేయడం వల్ల ఇద్దరికి చూపు వస్తుందన్నారు. డాక్టర్ శాంతి మాట్లాడుతూ నేత్రదానం వయసుతో సంబంధం లేకుండా స్త్రీలు, పురుషులు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ రాణెమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

వినాయక నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



కుందూ నది వద్ద పరిశీలిస్తున్న అధికారులు

చాపాడు : వినాయక నిమజ్జనం కోసం మండలంలోని సీతారామాపురం, అన్నవరం గ్రామాల వద్ద గల కుందూనది వద్ద ఏర్పాట్లను తహసీల్దారు రవీంద్రారెడ్డి, ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు, ఎస్ఐ చిన్న పెద్దయ్య, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి పరిశీలించారు. కుందూనదిలో అధికంగా వరద నీరు వస్తుండటంతో నిమజ్జనంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బారికేడ్లను ఏర్పాటు చేయాలని వారు పేర్కొన్నారు. నిమజ్జన సమయంలో పోలీసు సిబ్బందితో పాటు వీఆర్ఓ, వీఆర్ఏలు అందుబాటులో ఉండాలని, ఇదే క్రమంలో ఎలాంటి అపశ్రుతి తలెత్తినా సమస్యను పరిష్కరించేలా సామగ్రిని సిద్ధంగా ఉంచాలని తహసీల్దారు రవీంద్రారెడ్డి సూచించారు.

వైవీయూ ఇన్‌చార్జి వీసీని తొలగించాలి



ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థుల నిరసన

ప్రొద్దుటూరు కల్చరల్ : యోగివేమన యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ కె.కృష్ణారెడ్డిని తొలగించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఇంటర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు శివశంకర్, వలరాజు మాట్లాడుతూ ఆచార్య కృష్ణారెడ్డి లైంగిక వేధింపులకు పాల్పడ్డారని, తన దగ్గర పరిశోధన చేసే విద్యార్థులను ఇంటిపని, వ్యక్తిగత పనులకు ఉపయోగించుకునే వారన్నారు. మచిలీపట్నంలో ఉన్న కృష్ణ విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్‌గా ఉన్నప్పుడు యూనివర్సిటీ గెస్ట్ హౌస్‌లో అసాంఘిక కార్యక్రమాలకు, అవినీతి అక్రమాలకు పాల్పడేవారన్నారు. ఈయనను ఇన్‌చార్జి వీసీ పదని నుంచి తొలగించి రెగ్యులర్ వీసీని నియమించాలని కోరారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



బద్వేలులో పోషకాహార మాసోత్సవాలపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి

బద్వేలు అర్బన్ : గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పోషకాహారం తీసుకోవడం వలన సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి పేర్కొన్నారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక గాంధీవీధి అంగన్వాడీ కేంద్రంలో పోషకాహార విశిష్టతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, కిశోర బాలికలు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉన్నటువంటి మునగాకు, గోంగూర, బెల్లం, నిమ్మజాతి పండ్లను ప్రతిరోజు ఆహారంలో తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించుకోవచ్చని తెలిపారు. అలాగే అంగన్వాడీ కేంద్రాల్లో ఇచ్చే పాలు, గుడ్లు, బాలసంజీవనిని తల్లులు మాత్రమే వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. పోషకాహార విశిష్టతతోపాటు తల్లిపాల విశిష్టతపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం ప్రాజెక్టు పరిధిలోని కొండూరు ఎస్టీకాలనీ, బద్వేలు రూరల్‌లోని రామ్‌నగర్, బి.కోడూరు మండలంలోని ఐత్రంపేట అంగన్వాడీ కేంద్రాలను సందర్శించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి, సూపర్‌వైజర్ సుబ్బలక్షుమ్మ, ఏఎన్ఎంలు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

పోరుమామిళ్ల : గర్భవతులు, బాలింతలు రోజూ పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలక్ష్మి తెలిపారు. సిద్ధవరం అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం పోషకాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఆ కేంద్రం పరిధిలో పండించిన ఆకుకూరలు, కూరగాయలు గర్భవతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు డైరెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో ఇచ్చే పాలు, గుడ్లు తీసుకోవాలన్నారు. చిరుధాన్యాలతో చేసే ఆహారపదార్థాలు తినాలన్నారు. కార్యక్రమలో ఆశ, అంగన్వాడీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లోక్‌అదాలత్ విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఎస్.బాబాఫక్రుద్దీన్

బద్వేలు అర్బన్ : ఈ నెల 14న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేసేందుకు పోలీసులు సహకరించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్, సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.గాయత్రిలు పేర్కొన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి సూచనల మేరకు మంగళవారం స్థానిక కోర్టు ఆవరణలో కోర్టు పరిధిలోని అన్ని పోలీసుస్టేషన్ల పోలీసు అధికారులు, న్యాయవాదులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కక్షిదారుల్లో అవగాహన పెంపొందించి ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని కోరారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులు, రాజీ పడటానికి అవకాశం ఉన్న కేసులు పరిష్కరించుకునేందుకు లోక్‌అదాలత్ మంచి వేదిక అని అన్నారు. సమావేశంలో రూరల్ సీఐ, ఆయా స్టేషన్ల ఎస్ఐలు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు, న్యాయవాదులు, కోర్టు కానిస్టేబుళ్ళు తదితరులు పాల్గొన్నారు.

సబ్‌జైలు సందర్శన

పట్టణంలోని సబ్‌జైలును జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్, సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.గాయత్రిలు సందర్శించారు. ఇందులో భాగంగా జైలు పరిసరాలను, వసతిగదులు, వంటగది, మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఖైదీలకు అందుతున్న సదుపాయాలను సబ్‌జైలు సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ శ్రీహరి, కోర్టు సిబ్బంది, సబ్‌జైలు సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య, ఆరోగ్య సమస్యలపై ఉద్యమం



మాట్లాడుతున్న ఎంపీజే నాయకుడు సలీం

ప్రొద్దుటూరు కల్చరల్ : మూవ్‌మెంట్ అండ్ పీస్ జస్టిస్ ఆధ్వర్యంలో ఈ నెల 15 వరకు రాష్ట్ర వ్యాప్తంగా వైద్య, ఆరోగ్య సమస్యలపై ఉద్యమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలీం పేర్కొన్నారు. స్థానిక ఎంపీజే కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్యపరంగా ప్రజలకు కల్పించే ఆరోగ్యశ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్‌ను అర్హులైన వారందరికీ అందేలా చూడాలన్నారు. గ్రామీణ, ఏరియా, జిల్లా ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన సౌకర్యాలను కల్పించాలని కోరారు. సమావేశంలో ఎంపీజే జిల్లా అధ్యక్షుడు జాకీర్ ఉమ్రి, పట్టణాధ్యక్షుడు హుసేన్‌బాషా, కార్యదర్శి మహ్మద్‌రఫీ పాల్గొన్నారు.

కూతురు పుట్టడం దేవుడిచ్చిన వరం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : కూతుళ్లు పుట్టడం దేవుడిచ్చిన వరమని డాక్టర్ నల్లబల్లి హిమబిందు తెలిపారు. సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో వైఎంఆర్ కాలనీలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో పీసీ పీఎన్‌డీటీ యాక్ట్ 1994పై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ కూతురంటే భారం కాదని, కుటుంబానికి దేవుడిచ్చిన వరమని చెప్పారు. ఆడపిల్లయినా మగ పిల్లాడైనా ఒక్కటే అని తెలిపారు. లింగవివక్షతతో గర్భస్రావానికి పాల్పడవద్దని, అలా చేయడం తల్లి ప్రాణానికి హానికరమన్నారు. చట్టాన్ని అతిక్రమించి లింగనిర్ధారణ పరీక్షలు చేసిన వారికి, చేయించిన వారికి జైలు శిక్షతోపాటు జరిమానా విధిస్తారని పేర్కొన్నారు. అనంతరం వైఎంఆర్ కాలనీలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిర్డ్ సొసైటీ ప్రెసిడెంట్ ఎంవై సుబ్బారెడ్డి, కార్యదర్శి చెన్నమ్మ, సభ్యులు రమణమ్మ, గంగాభవాని, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు, స్థానికులు పాల్గొన్నారు.

వరిలో కాలిబాటలతో మేలు



వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వర్‌రావు

బి.కోడూరు : మండలంలోని ఐత్రంపేట రైతుభరోసా కేంద్రాన్ని జిల్లా వ్యవసాయాధికారి ఎ.నాగేశ్వర్‌రావు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం మండలంలోని పాయలకుంట్ల గ్రామంలో రైతులు సాగు చేసిన వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రైతులు సాగు చేసే వరిపంటలో కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలని, అలాగే పంట మధ్యలో జిగురు అట్టలు ఏర్పాటు చేసుకోవడం వలన తెగుళ్ళ బారి నుంచి పంటను కాపాడుకోవడంతోపాటు అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు. కాలిబాటల వలన వరిలో వ్యాపించే దోమపోటును నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో పోరుమామిళ్ల డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు మురళీధర్‌రెడ్డి, వ్యవసాయ సిబ్బంది బ్రహ్మానందరెడ్డి, చెన్నారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి కల్పించాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ కోరారు. పోరుమామిళ్లలో నిర్వహించిన రాజకీయ శిక్షణ తరగతుల్లో రెండో రోజైన మంగళవారం ఆయన మాట్లాడారు. వెదురు ఆధారిత పేపర్, బెరైటీ ఆధారిత రంగుల, బంకమట్టి ఆధారిత జాడీల పరిశ్రమలు ఏర్పాటు చేయవచ్చన్నారు. కులగణన చేయకుండా కేంద్రం 3 ఏళ్లుగా దాటేస్తుందని, కులగణన చేయకుండా ఉపకులాల అభివృద్ధి అసాధ్యమని పేర్కొన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం ప్రజలను వాగ్దానాలతో మభ్య పెట్టి, ఇప్పుడు చెత్త రాజకీయాలు చేస్తోందని, ఇప్పటికైనా హామీలు నెరవేర్చాలన్నారు. భూకబ్జాలపై కేసులు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రామ్మోహన్, మండల కార్యదర్శి భైరవప్రసాద్, గౌసియాబేగం తదితరులు పాల్గొన్నారు.

స్వీపర్లకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు సత్యనారాయణ, విజయ్‌కుమార్

ప్రొద్దుటూరు క్రైం : స్వీపర్లకు నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా ఆస్పత్రిలో పని చేస్తున్న స్వీపర్లకు వేతనాలు చెల్లించాలని డిమాండు చేస్తూ మంగళవారం ఆస్పత్రి వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వీపర్లకు ప్రభుత్వం రూ.16 వేల వేతనం చెల్లించాల్సి ఉండగా కాంట్రాక్టర్ తక్కువ ఇస్తున్నారని చెప్పారు. నెలల తరబడి జీతాలు ఇవ్వకుంటే వారు కుటుంబాలను ఎలా పోషించుకుంటారన్నారు. అంతేగాక పీఎఫ్, ఈఎస్ఐ కూడా కాంట్రాక్టర్ కట్టలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి రాఘవ, డీవైఎఫ్ఐ కార్యదర్శి విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ధరలు తగ్గించాలని సీపీఐ ఆందోళన



పోరుమామిళ్లలో సీపీఐ ఆధ్వర్యంలో అర్ధనగ్న ప్రదర్శన

పోరుమామిళ్ల : నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అదుపు చేయలేకపోతున్నాయని సీపీఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం బస్టాండు ఆవరణలో సీపీఐ నాయకులు తలపై కూరగాయల బుట్టలు పెట్టుకుని, అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గసభ్యులు వీరశేఖర్, ఏరియా సహాయ కార్యదర్శి మస్తాన్, మండల కార్యదర్శి రవి మాట్లాడుతూ ధరల అదుపుపై ప్రధాని మోదీ మాట నిలబెట్టుకోలేదన్నారు. 14 రకాల నిత్యావసర వస్తువులు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందించాల్సిన ప్రభుత్వాలు కేవలం బియ్యంతో సరిపెడుతున్నాయన్నారు. రేషన్‌కార్డులు కుదించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు జాకోబ్, రమణ, ఫిరోజ్, చెన్నయ్య, సునీల్, అబ్దుల్, అన్వర్, నరసింహులు, జ్యోతి, విశ్వాసమ్మ, షాహిదా, బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.